www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY

## కాళేశ్వరంపై హరీష్ రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్

**హైదరాబాద్ ఆగస్టు 04 (సిద్దిపేట పవర్):**

రాష్ట్రంలో కాళేశ్వరంఅంశం కలకలం రేపుతోంది. సోమవారం కాళేశ్వరం కమిషన్ నివేదికపై కేబినెట్‌లో సుదీర్ఘంగా చర్చించారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ కీలక నిర్ణయం తీసుకుంది. మంగళవారం తెలంగాణ భవన్ వేదికగా కాళేశ్వరంపై ఆ పార్టీ నేత హరీష్ రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై బ్రీఫింగ్ ఇవ్వనున్నారు.

కాగా, ప్రాజెక్టుకు సంబంధించి జస్టిస్ పీసీ ఘోష్ ఇచ్చిన నివేదికపై మంత్రివర్గంలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ప్రభుత్వం నియమించిన అధ్యయన కమిటీ.. 650 పేజీల కాళేశ్వరం నివేదికను 60 పేజీల సారాంశంగా తయారు చేసింది. కేబినెట్‌కు సమర్పించిన ఈ సంక్షిప్త నివేదికలో 32 సార్లు కేసీఆర్, 19 సార్లు హరీశ్‌రావు, 5 సార్లు ఈటల రాజేందర్ ప్రస్తావన వచ్చినట్లు సమాచారం.



సంపుటి: 01 | సంచిక: 137 | హైదరాబాద్ | మంగళవారం | 04-08-2025 | పేజీలు: 05 | ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు

## శిబూ సోరెన్ మృతిపట్ల కేసీఆర్ సంతాపం..

శిబు సోరెన్ మృతి పట్ల కేసీఆర్ విచారం

నేను ప్రారంభించిన ఉద్యమానికి ఆయన అండగా నిలిచారు

ప్రాంతీయ అస్తిత్వ రాజకీయాలకు తీరని లోటు అని వ్యాఖ్య

2022లో ఆయన ఆశీస్సులు తీసుకున్నానని వెల్లడి



2

## యూరియా కోత.. రైతన్న వెత

### వరినాట్లు ఊపందుకోవడంతో పెరిగిన డిమాండ్

అవసరానికి మించి యూరియా సరఫరా చేశామన్న కేంద్రం ప్రకటనతో గందరగోళం

డీఏపీ, ఎంఓపీ, కాంప్లెక్స్..అన్ని ఎరువులూ కలిపి చెప్పారంటున్న రాష్ట్ర అధికారులు

రైతులకు తప్పుడు సంకేతాలు వెళ్లే అవకాశం ఉందంటూ ఆందోళన

వానాకాలానికి 10.48 ఎల్ఎంటీల అడిగితే 9.80 ఎల్ఎంటీలే కేటాయించారు

4 నెలల్లో 6.60 ఎల్ఎంటీలు ఇవ్వాల్సి ఉంటే ఇప్పటివరకు 4.50 ఎల్ఎంటీలే ఇచ్చారు

కేంద్రమంత్రికి రాష్ట్ర మంత్రి తుమ్మల లేఖ.. తక్షణమే యూరియా సరఫరాకు విజ్ఞప్తి

ఆగస్టులో కనీసం 2 ఎల్ఎంటీలైనా వస్తేనే గండం గట్టెక్కుతామంటున్న అధికారులు

తీవ్రమైన కొరత నేపథ్యంలో ఒక్కొక్కరికి 2 బస్తాలే ఇస్తున్న ప్రభుత్వం



**హైదరాబాద్ ఆగస్టు 04 (సిద్దిపేట పవర్):**

ఇటీవలి వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలో వరినాట్లు ఊపందుకున్నాయి. దీంతో ఎరువుల కోసం డిమాండ్ పెరుగుతోంది. ముఖ్యంగా అవసరమైన మొత్తంలో యూరియా కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. అయితే తీవ్రమైన కొరత నేపథ్యంలో ప్రభుత్వం రేషన్ విధానంలో ఒక్కొక్కరికి రెండు బస్తాలే ఇస్తుండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మరోవైపు ఈ ఆగస్టు నెలలో రైతుల అవసరాలు తీరాలంటే కనీసం 2 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్ఎంటీ) యూరియా అవసరమని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. కేంద్రం నుంచి ఆ మేరకు యూరియా వస్తేనే గండం గట్టెక్కే అవకాశం ఉంటుందని, లేకపోతే రైతులు రోడ్లు ఎక్కే పరిస్థితి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రానికి కేంద్రం వానాకాలం సీజన్‌కు గాను నెలల వారీగా కేటాయించిన 9.80 ఎల్ఎంటీల యూరియాలో కోత పెట్టడంతోనే రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాష్ట్ర ప్రభుత్వం చెబుతుండగా..రాష్ట్రానికి కోటాకు మించి ఎరువులు సరఫరా చేశామంటూ కేంద్ర మంత్రి చేసిన ప్రకటనతో ..మిగతా 3లో

## బీసీ రిజర్వేషన్ల అమలుకు మద్దతిస్తాం

42 శాతం రిజర్వేషన్లు పూర్తిగా బీసీలకే ఇస్తామంటే మద్దతిస్తామని స్పష్టీకరణ

10 శాతం రిజర్వేషన్లు ముస్లింలకు ఇస్తే బీసీలకు అన్యాయం జరుగుతుందన్న రామచందర్ రావు

బీసీ రిజర్వేషన్లు ఇవ్వడం కాంగ్రెస్‌కు ఇష్టం లేదన్న రామచందర్ రావు



2

## కాళేశ్వరం అవకతవకలకు కేసీఆరే ప్రత్యక్ష బాధ్యుడు

కాళేశ్వరం అక్రమాలకు కేసీఆరే ప్రత్యక్ష బాధ్యుడని నిర్ధారణ

ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన జస్టిస్ ఘోష్ కమిషన్

మాజీ మంత్రులు, ఐఏఎస్ అధికారులు, ఇంజనీర్ల ప్రమేయంపై స్పష్టత

ఎల్ &టీ సహా కాంట్రాక్టు సంస్థలకూ బాధ్యతల ఖరారు

నివేదిక సారాంశంపై తెలంగాణ కేబినెట్‌లో చర్చకు రంగం సిద్ధం



2

## కల్వకుంట్ల కవిత ఎవరో నాకు తెలియదు

కేసీఆర్, హరీశ్ వద్ద ఎన్ని కోట్లు ఉన్నాయో..

కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజినీర్ల వద్దే కోట్లు దొరుకుతున్నాయన్న కోమటిరెడ్డి

కాళేశ్వరం అవినీతిపై పూర్తి స్థాయిలో విచారణ జరుగుతోందని వెల్లడి

కవిత ఎవరో తనకు తెలియదని వ్యాఖ్య

కల్వకుంట్ల కవిత బీసీ ధర్నా జోక్



2

## బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేయొచ్చు.. భయపడొద్దు

కాళేశ్వరం కమిషన్ నివేదికపై కేసీఆర్ కీలక వ్యాఖ్యలు

అది కాళేశ్వరం కమిషన్ కాదు కాంగ్రెస్ కమిషన్

కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్ ఊహించిందే

ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు

కొంతమంది బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేయొచ్చు.. భయపడొద్దు :కేసీఆర్



**హైదరాబాద్ ఆగస్టు 04 (సిద్దిపేట పవర్):**

సిద్ధిపేట జిల్లాలోని ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు (కేసీఆర్) కీలక సమావేశం నిర్వహించారు. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుపై కమిషన్ నివేదిక బయటకు వచ్చిన నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది.

ఆరు గంటలుగా కొనసాగుతున్న ఈ భేటీలో హరీష్ రావు, కేటీఆర్, జగదీష్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి వంటి పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. కాళేశ్వరం అంశంపై పార్టీ తరపున తీసుకోవాల్సిన భవిష్యత్ చర్యలపై చర్చించారు.

సమావేశంలో కేసీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. "ఇది కాళేశ్వరం కమిషన్ కాదు, కాంగ్రెస్ కమిషన్" ..మిగతా 2లో



2

## తాగు.. ఊగు!..

పట్టణాల్లో బీర్ కేఫ్‌లు.. పల్లె పల్లెనా వైన్ షాపులు

మహా నగరానికి వెలుపలి పట్టణాల్లోనూ..

మైక్రో బ్రూవరీలకు ప్రభుత్వం కసరత్తు

అమ్మకాలు తగ్గితే పల్లెలకూ విస్తరింపు

చుక్క మద్యం అమ్మకుండానే 15 రోజుల్లో 15 వేల కోట్ల మద్యాదాయ ఆర్జనకు ప్లాన్

నేడు లేదా రేపు నూతన పాలసీ ప్రకటన

## అవయవదానంలో దేశానికే ఆదర్శంగా తెలంగాణ..

అవయవదానంలో దేశంలోనే తెలంగాణ నంబర్ వన్

కేంద్ర ఆరోగ్య శాఖ, నోటో గణాంకాలలో వెల్లడి

'జీవన్‌దాన్' కార్యక్రమం విజయవంతంతోనే ఈ ఘనత

మరణానంతర అవయవదానంలో తెలంగాణ టాప్

రాష్ట్రంలో ఏటా పెరుగుతున్న అవయవదాతల సంఖ్య



**హైదరాబాద్ ఆగస్టు 04 (సిద్దిపేట పవర్):**

అవయవదానంలో తెలంగాణ రాష్ట్రం మరోసారి తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. 2024 సంవత్సరానికి గాను దేశంలోనే అత్యధిక అవయవదానాలు చేసిన రాష్ట్రంగా తెలంగాణ నంబర్ వన్‌గా నిలిచింది. ఈ విషయాన్ని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ మరియు జాతీయ అవయవ, కణజాల మార్పిడి సంస్థ (నోటో) విడుదల చేసిన అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా మరణానంతరం చేసే అవయవదానంలో ..మిగతా 2లో

## ఇవేం మాటలు?... రాహుల్ గాంధీపై సుప్రీంకోర్టు ఆగ్రహం

చైనాతో సరిహద్దులో భారత సైన్యం సరిగా పోరాడలేదన్న రాహుల్

పరువు నష్టం కేసు దాఖలు చేసిన బీజేపీ నేత

ఈ కేసుపై స్టే ఇచ్చిన అత్యున్నత న్యాయస్థానం

ఆచితూచి వ్యాఖ్యలు చేయాలంటూ రాహుల్ కు హితవు



2


## కవిత దీక్షకు కోర్టు నో.. ఇంటికి కవిత

కోర్టు నోతో ముగిసిన ఎమ్మెల్సీ కవిత నిరాహార దీక్ష

ధర్నా చౌక్‌లో పోలీసులుజాగృతి కార్యకర్తల మధ్య ఉద్రిక్తత

కవితను ఇంటికి తరలించేందుకు సిద్ధమైన పోలీసులు

కోర్టు తీర్పుతో దీక్షకు కొత్త మలుపు



**హైదరాబాద్ ఆగస్టు 04 (సిద్దిపేట పవర్):**

హైదరాబాద్ ధర్నాచౌక్‌లో కొనసాగుతున్న MLC కల్వకుంట్ల కవిత 72 గంటల నిరాహార దీక్ష మంగళవారం డ్రామాటిక్ మలుపు తిరిగింది. కోర్టు అనుమతి నిరాకరించడంతో, పోలీసులు కవితను దీక్షా స్థలం నుంచి ఇంటికి తరలించే ఏర్పాట్లు ప్రారంభించారు. కోర్టు తీర్పు వచ్చిన వెంటనే, పోలీసులు మరోసారి కవితను దీక్ష విరమించాలని కోరారు. అయితే కవిత అనుచరులు, జాగృతి ..మిగతా 2లో

## బీసీ రిజర్వేషన్ల అమలుకు మద్దతిస్తాం

- 42 శాతం రిజర్వేషన్లు పూర్తిగా బీసీలకే ఇస్తామంటే మద్దతిస్తామని స్పష్టీకరణ
- 10 శాతం రిజర్వేషన్లు ముస్లింలకు ఇస్తే బీసీలకు అన్యాయం జరుగుతుందన్న రామచందర్ రావు
- బీసీ రిజర్వేషన్లు ఇవ్వడం కాంగ్రెస్‌కు ఇష్టం లేదన్న రామచందర్ రావు



**హైదరాబాద్ ఆగస్టు 04 (సిద్దిపేట పవర్):**

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పినప్పుడు, అందులో 10 శాతం ముస్లింలకు ఇస్తామని కాంగ్రెస్ చెప్పలేదని, పూర్తిగా బీసీలకే రిజర్వేషన్లు ఇస్తే తాము పూర్తిస్థాయిలో మద్దతు ఇస్తామని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు స్పష్టం చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఢిల్లీలో కాంగ్రెస్ చేపట్టిన ధర్నాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే ఉద్దేశం లేదని విమర్శించారు.

హైదరాబాద్‌లో చేసినట్లే ఢిల్లీకి వెళ్లి నాటకాలు చేస్తున్నారని విమర్శించారు. బీసీలకే 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామంటే బీజేపీ పూర్తి మద్దతు ఇస్తుందని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి బీసీ రిజర్వేషన్లు ఇవ్వడం ఇష్టం లేదని ఆరోపించారు.

42 శాతం రిజర్వేషన్లు బీసీలకు ఇస్తామని చెప్పి, అందులో 10 శాతం ముస్లింలకు ఇస్తే అణగారిన వర్గాలకు అన్యాయం జరుగుతుందని మండిపడ్డారు. రిజర్వేషన్లను బీజేపీ అడ్డుకుంటోందని ప్రచారం చేస్తోన్న కాంగ్రెస్ పార్టీని బీసీలు నమ్మరని ఆయన అన్నారు.

## కాళేశ్వరం అవకతవకలకు కేసీఆరే ప్రత్యక్ష బాధ్యుడు

- కాళేశ్వరం అక్రమాలకు కేసీఆరే ప్రత్యక్ష బాధ్యుడని నిర్ధారణ
- ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన జస్టిస్ ఘోష్ కమిషన్
- మాజీ మంత్రులు, ఐఏఎస్ అధికారులు, ఇంజనీర్ల ప్రమేయంపై స్పష్టత
- ఎల్&టీ సహా కాంట్రాక్టు సంస్థలకూ బాధ్యతల ఖరారు
- నివేదిక సారాంశంపై తెలంగాణ కేబినెట్‌లో చర్చకు రంగం సిద్ధం



**హైదరాబాద్ ఆగస్టు 04 (సిద్దిపేట పవర్):**

తెలంగాణలో సంచలనం సృష్టించిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో జరిగిన భారీ అవకతవకలకు నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యక్షంగా, పరోక్షంగా పూర్తి బాధ్యత వహించాలని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తన నివేదికలో తేల్చిచెప్పింది. ప్రాజెక్టు ప్రణాళిక, నిర్మాణం, నిర్వహణ మొదలుకొని ధరల సర్దుబాట్లు, కాంట్రాక్టు సవరణలు, ఆర్థిక హామీల వరకు అన్నింటిలోనూ కేసీఆర్ పాత్ర ఉందని కమిషన్ నిర్ధారించింది. ఈ మేరకు అధికారులు అధ్యయనం చేసి సిద్ధం చేసిన నివేదిక సారాంశంలో ఈ విషయాలు వెల్లడయ్యాయి.

కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో నాణ్యతా లోపాలు, డిజైన్ల రూపకల్పన, నిర్వహణలో వైఫల్యాలు అంటూ వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపిన జస్టిస్ ఘోష్ కమిషన్, తన తుది నివేదికను జులై 31న ప్రభుత్వానికి సమర్పించింది. ఈ నివేదికను క్షుణ్ణంగా అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం ఆగస్టు 1న ఓ ఉన్నతాధికారుల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ రూపొందించిన సారాంశాన్ని సోమవారం జరగనున్న రాష్ట్ర కేబినెట్ సమావేశంలో చర్చించనున్నారు.

ఈ నివేదికలో కేవలం కేసీఆర్‌నే కాకుండా, పలువురు రాజకీయ, అధికార ప్రముఖులను కూడా బాధ్యులుగా పేర్కొన్నారు. నాటి ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ ఆర్థిక బాధ్యతల నుంచి తప్పుకున్నారని, మొత్తం వ్యవహారాన్ని కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ కార్పొరేషన్ లిమిటెడ్ (కేఐపీసీఎల్)పై నెట్టేశారని కమిషన్ అభిప్రాయపడింది. అప్పటి నీటిపారుదల శాఖ మంత్రి జవాబుదారీతనం లేకుండా అడ్డగోలు ఆదేశాలు జారీ చేస్తూ పరిపాలనా ప్రక్రియను నిర్వీర్యం చేశారని తెలిపింది.

అదేవిధంగా, నాటి నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి, ఐఏఎస్ అధికారి ఎస్.కె. జోషి.. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణాన్ని అడ్డుకోగల కీలకమైన నిపుణుల కమిటీ నివేదికను తొక్కిపెట్టారని కమిషన్ గుర్తించింది. సీఎం కార్యాలయంలో అదనపు కార్యదర్శిగా పనిచేసిన ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ కీలక దస్త్రాలను కేబినెట్ ముందు ఉంచకుండా నిబంధనలు ఉల్లంఘించారని నివేదికలో ఉంది. కేఐపీసీఎల్ బోర్డు సభ్యులు సైతం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని, నేరపూరిత విశ్వాసఘాతుకానికి పాల్పడ్డారని పేర్కొంది.

మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణ కాంట్రాక్టర్ ఎల్ అండ్ టీ సంస్థకు ఎలాంటి సర్టిఫికెట్లు పొందే అర్హత లేదని, దెబ్బతిన్న ఏడో బ్లాకును సొంత ఖర్చుతో పునరుద్ధరించాలని కమిషన్ ఆదేశించింది. పలువురు చీఫ్ ఇంజనీర్లు, ఇతర ఇంజనీరింగ్ అధికారులు డిజైన్లలో లోపాలు, నాణ్యత లేమికి బాధ్యులని తేల్చింది. కాంట్రాక్టర్లకు మేలు చేసేలా తప్పుడు సర్టిఫికెట్లు ఇచ్చారని స్పష్టం చేసింది.

2023 అక్టోబర్‌లో మేడిగడ్డ బ్యారేజీ పియర్లు కుంగిపోవడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దీనిపై 2024 మార్చి 14న జస్టిస్ ఘోష్‌తో ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

## శిబూ సోరెన్ మృతిపట్ల కేసీఆర్ సంతాపం..

- శిబు సోరెన్ మృతి పట్ల కేసీఆర్ విచారం
- నేను ప్రారంభించిన ఉద్యమానికి ఆయన అండగా నిలిచారు
- ప్రాంతీయ అస్తిత్వ రాజకీయాలకు తీరని లోటు అని వ్యాఖ్య
- 2022లో ఆయన ఆశీస్సులు తీసుకున్నానని వెల్లడి



**హైదరాబాద్ ఆగస్టు 04 (సిద్దిపేట పవర్):**

జార్ఖండ్ ముక్తి మోర్చా (JMM) అధినేత, జార్ఖండ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి శిబూ సోరెన్ మృతి పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ (KCR) సంతాపం వ్యక్తంచేశారు. ఆయన మరణం జార్ఖండ్, తెలంగాణ వంటి దేశ ప్రాంతీయ అస్తిత్వ రాజకీయాలకు, జాతీయ ఫెడరల్ స్ఫూర్తికి, ఆదివాసీ సమాజానికి తీరని లోటని అన్నారు. ఈ సందర్భంగా శిబూ సోరెన్‌తో తనకున్న వ్యక్తిగత అనుబంధాన్ని, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి వారందించిన సహకారాన్ని స్మరించుకున్నారు. దేశ ఫెడరల్ స్ఫూర్తిని ప్రతిఫలించే దిశగా, శిబూ సోరెన్ చేపట్టిన జార్ఖండ్ స్వరాష్ట్ర ఏర్పాటు ఉద్యమం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి స్ఫూర్తి నింపిందన్నారు.

2001లో తెలంగాణ రాష్ట్ర సమితి (TRS) స్థాపన సమయంలో శిబూ సోరెన్‌ని హైదరాబాద్‌లో జరిగిన తొలి సభకు మొదటి అతిథిగా ఆహ్వానించుకున్నామని గుర్తు చేశారు. నాటి తెలంగాణ ఉద్యమానికి ఆయన తెలిపిన సంపూర్ణ సంఘీభావం మర్చిపోలేనిదని చెప్పారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గుర్తించిన శిబూ సోరెన్, తాను ప్రారంభించిన తెలంగాణ మలిదశ ఉద్యమానికి అండగా నిలిచారని కేసీఆర్ తన కృతజ్ఞతా భావాన్ని వ్యక్తం చేశారు.

2014లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సమయంలో కూడా శిబూ సోరెన్ మద్దతుగా నిలిచారని, జార్ఖండ్, తెలంగాణ ప్రజల ఉద్యమ విజయాలు దేశ ఫెడరల్ స్ఫూర్తికి, ప్రాంతీయ, సామాజిక న్యాయానికి దిక్సూచిగా నిలిచాయని కేసీఆర్ తెలిపారు. శిబూ సోరెన్ నేతృత్వంలోని జేఎంఎం పార్టీ తెలంగాణ ఉద్యమ సమయంలో కేంద్రంలో ఉన్న యూపీఏ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉండడంతో రాష్ట్ర ఏర్పాటు కోసం ఒత్తిడి తేవడంలో కీలక పాత్ర పోషించిందని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతర కాలంలో 2022లో జార్ఖండ్‌లో శిబూ సోరెన్‌ని కలిసి వారి ఆశీస్సులు తీసుకున్న విషయాన్ని కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. తండ్రిని కోల్పోయి దుఃఖ సంద్రంలో మునిగిన వారి కుమారుడు జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్‌కు, వారి కుటుంబ సభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## తాగు.. ఊగు!..

- పట్టణాల్లో బీర్ కేఫ్‌లు.. పల్లె పల్లెనా వైన్ షాపులు
- మందు సీసాలు ముందు పెడ్తున్న రేవంత్ సర్కార్
- మహా నగరానికి వెలుపలి పట్టణాల్లోనూ.. మైక్రో బ్రూవరీలకు ప్రభుత్వం కసరత్తు
- అమ్మకాలు తగ్గితే పల్లెలకూ విస్తరింపు
- చుక్క మద్యం అమ్మకుండానే 15 రోజుల్లో 15 వేల కోట్ల మద్యాదాయ ఆర్జనకు ప్లాన్
- నేడు లేదా రేపు నూతన పాలసీ ప్రకటన

**హైదరాబాద్ ఆగస్టు 04 (సిద్దిపేట పవర్):**

తొమ్మిది రోజుల్లో రూ .9 వేల కోట్ల రైతు భరోసా ఇచ్చామని గొప్పలకు పోయిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సరిగ్గా నెల తిరక్క ముందే 15 రోజుల్లో రూ. 15 వేల కోట్లు జనం దగ్గర నుంచి గుంజుకునే లిక్కర్ పాలసీ అమల్లోకి తెస్తున్నది. ఇది చుక్క మద్యం కూడా అమ్మకుండానే పిండుకునే రాబడి. పల్లె, పట్టణ జనాలను తాగుబోతులుగా మార్చి గల్లా పెట్టెను ఫుల్లుగా నింపడం ద్వారా నెలకు రూ. 4,500 కోట్లు ఆర్జించే వ్యాపార పథకం మరోటి ఉన్నది.

నెల రోజుల కిందటి రైతు భరోసా, అంతకు ముందు ఇచ్చిన రుణమాఫీ సొమ్ముకు 'బారు' వడ్డీ, దాని జేజమ్మ వడ్డీతో కలిపి లాక్కునేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మందు సీసాలను ముందు పెట్టింది. హైదరాబాద్ మహానగరం అవతల ఉన్న కార్పొరేషన్లలో ఇన్‌స్టంట్ బీరు కేఫ్‌లు, మండలం, గ్రామమనే తారతమ్యం లేకుండా ఎక్కడ సరుకు అమ్ముడుపోతే అక్కడికే మద్యం దుకాణం మార్చుకునే విధంగా ఎక్సైజ్ నిబంధనలు సవరించారు. ఈమేరకు నూతన ఎక్సైజ్ పాలసీ రూపొందించారు. సోమవారం సాయంత్రం కానీ, లేదా మంగళవారం మధ్యాహ్నం 6వ పేజీలో

### కొత్త నిబంధనలు

మద్యం దుకాణదారుల నుంచి లెవీ స్పెషల్ రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్‌ను ఏడాదికి రూ.5 లక్షల చొప్పున ఒకే వాయిదాలో వసూలు చేస్తారు. లైసెన్సుదారులు మూడేండ్ల ఎక్సైజ్ ఫీజులో ఒక ఏడాది లైసెన్స్ ఫీజు ముందే డిపాజిట్ చేయాలి. మిగిలిన ఫీజులో ఎనిమిదో వంతుకు సమానమైన రెండు ఫిక్స్‌డ్ డిపాజిట్లు లేదా బ్యాంకు గ్యారెంటీలు ఇవ్వాలి. ఎక్సైజ్ కమిషనర్ నిబంధనల మేరకు దుకాణాల్లో రోజువారీ లావాదేవీలు నమోదు చేసుకొనే వ్యవస్థ అవసరం. అన్ని షాపుల్లో మూడు సీసీటీవీ కెమెరాలు తప్పనిసరిగా ఉండాలి. వీటిని ఎక్సైజ్ శాఖ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించాలి. లికర్ షాపుల వద్ద తగిన పార్కింగ్ సౌకర్యం తప్పనిసరి. గానీ నూతన ఎక్సైజ్ పాలసీతో మద్యం దుకాణాలు, మైక్రో బ్రూవరీల లైసెన్స్‌లకు నోటిఫికేషన్ వెలువడనున్నట్టు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. 15 రోజుల్లో లైసెన్సీల నిర్ధారణ, దుకాణాల కేటాయింపులు పూర్తి అవుతాయని ఆ శాఖ అధికారులు చెప్తున్నారు.

### 11 పర్యాయాలకు ప్రివిలేజ్ ఫీజు

2011 జనాభా గణన ప్రాతిపదికనే రాష్ట్ర ప్రభుత్వం లైసెన్స్ దుఖాణాలు ఖరారు చేసింది. అయితే ప్రస్తుతం రెండేళ్లు మాత్రమే ఏ4 దుకాణాల లైసెన్స్ గడువును మూడేండ్లకు సవరించారు. దరఖాస్తు ఫారం ధర భారీగా పెంచారు. గతంలో రూ. 2 లక్షల ఉన్న ఫారం ధర ఇప్పుడు రూ. 3 లక్షలు చేశారు. అయితే లైసెన్స్ గడువు మూడేళ్లకు పెంచిన నేపథ్యంలో ఒక ఏడాది లైసెన్స్ ఫీజు అడ్వాన్స్‌గా తీసుకోవాలని నిర్ణయించారు. అయితే ఈ నిబంధనపై మద్యం వ్యాపారుల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత వ్యక్తం అవుతున్నది. ఈ నేపథ్యంలో



ప్రభుత్వం కొంత సందిగ్ధంలో పడ్డట్టు సమాచారం.

ఇప్పటి వరకు 10 పర్యాయాలు మాత్రమే ఉన్న ఎక్సైజ్ ప్రివిలేజ్ ఫీజ్‌ను 11 పర్యాయాలకు పెంచారు (దుకాణ లైసెన్స్ ఫీజు మీద 11 సార్లు మద్యం విక్రయిస్తే దుకాణదారుడికి ఇచ్చే రిటైలర్ మార్జిన్‌లో ఎలాంటి మార్పు లేకుండా). ఇది కొంత మద్యం దుకాణదారులకు ఊరట కలిగించే అంశమే. ఈ ఆప్షన్‌తో వ్యాపారులు ఏడాది లైసెన్స్ ఫీజు అడ్వాన్స్ పెట్టడానికి ఇబ్బంది పడక పోవచ్చని ఎక్సైజ్ అధికారులు సీఎంకు వివరించినట్టు తెలిసింది.

అలాగే రిటైల్ మార్జిన్ ఆర్డినరీ బ్రాండ్ల పైన 27 శాతం, మీడియం, ప్రీమియం బ్రాండ్ల పైన 20 శాతం, బీర్లపై 20 శాతంగా గతంలో ఉన్నట్టు గానే ఖరారు చేశారు. నూతన ఎక్సైజ్ పాలసీ ఈ ఏడాది డిసెంబర్ 1 నుంచి అమల్లోకి వస్తుంది. 2028 నవంబర్ 30న ముగుస్తుంది. గతంలో ఆరు స్లాబ్‌లుగా ఉన్న మద్యం దుకాణాలను యథాతథంగా ఉంచారు. లాటరీ విధానం ద్వారా మద్యం షాపుల ఎంపిక ఉంటుంది. 10 శాతం షిఫ్టింగ్ ఫీజుతో మద్యం దుకాణాలను స్లాబ్ నిబంధనకు లోబడి రాష్ట్రంలోని ఏ ప్రాంతానికైనా మార్చుకునే వెసులుబాటు కల్పించారు.

### పట్టణాల్లో బీరు కేఫ్‌లు

ఇన్‌స్టంట్ కాఫీ షాపుల తరహాలో రాష్ట్రంలో ఇన్‌స్టంట్ బీర్ కేఫ్‌లు తెస్తున్నారు. ఇది కూడా ఒక రకంగా ఇన్‌స్టంట్ కాఫీ షాప్ లాంటిదే! కాకపోతే ఇకడ కాఫీ బదులు బీరు వస్తుంది. ప్రస్తుతం ఇవి హైదరాబాద్‌కు మాత్రమే పరిమితమై ఉన్నాయి. బార్, పబ్బు ఉన్న వారికి మాత్రమే వాటిని అనుబంధంగా మైక్రో బ్రూవరీలకు అనుమతించే వారు. ఇప్పుడు వీటిని రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించటానికి ఎక్సైజ్ నిబంధనల్లో క్యాబినెట్ సరవణలు చేశారు.

నివాస ప్రాంతాల్లో 1,000 లీటర్ల ఫ్రెష్ బీర్‌ను ఉత్పత్తి చేయగలిగి, విక్రయించే సామర్థ్యం ఉన్న చోట మైక్రోబ్రూవరీలను అనుమతించే విధంగా ఎక్సైజ్ నిబంధనలు సవరించారు. నగరంలో ప్రతి 5 కిలోమీటర్ల దూరంలో, మహానగరానికి అవల ఉన్న అన్ని కార్పొరేషన్లలో కూడా మైక్రోబ్రూవరీల ఏర్పాటుకు అనుమతించే పాలసీ తెచ్చారు. ఈ ఏడాది ఒక్క హైదరాబాద్‌లోనే కనీసం 100 మైక్రో బ్రూవరీలనైనా ఏర్పాటు చేసే దిశగా ఔత్సాహిక వ్యాపారులను ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఎక్సైజ్ శాఖను నిర్దేశించినట్టు తెలిసింది. మైక్రో బ్రూవరీల లైసెన్స్ ఫీజు రూ.5 లక్షలకు పెంచారు.

వినియోగించే ప్రతి లీటర్ బీరుకు రూ. 48 చొప్పున ఎక్సైజ్ డ్యూటీ ఫీజు నిర్ధారించారు. ఔత్సాహిక వ్యాపారులు కోరితే పబ్బు, క్లబ్బు, బారుకు అనుసంధాన పరిమితులు ఏవీ లేకుండా వ్యక్తిగతంగా ఇవ్వాలని నిర్ణయించారు. మైక్రో బ్రూవరీ మిషినరీ కొనుగోలు సామర్థ్యం లేనివారికి స్థానిక బ్రూవరీల నుంచి ఫ్రెష్ బీరు తెచ్చుకునే వెసులుబాటు కల్పించారు. తెలంగాణలో ప్రతి 13 వేల మందికి ఒకటి చొప్పున కేఫ్ ఏర్పాటు చేసే విధంగా ఎక్సైజ్ నిబంధనలను సవరించింది.

## కల్వకుంట్ల కవిత ఎవరో నాకు తెలియదు

- కేసీఆర్, హరీశ్ వద్ద ఎన్ని కోట్లు ఉన్నాయో..
- కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజినీర్ల వద్దే కోట్లు దొరుకుతున్నాయన్న కోమటిరెడ్డి
- కాళేశ్వరం అవినీతిపై పూర్తి స్థాయిలో విచారణ జరుగుతోందని వెల్లడి
- కవిత ఎవరో తనకు తెలియదని వ్యాఖ్య
- కల్వకుంట్ల కవిత బీసీ ధర్నా జోక్



**హైదరాబాద్ ఆగస్టు 04 (సిద్దిపేట పవర్):**

కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి, ఫోన్ ట్యాపింగ్‌లో ఉన్న ఎవరైనా జైలుకు వెళ్లక తప్పదని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజినీర్ల వద్దే కోట్లు దొరుకుతున్నాయంటే... ఆ సమయంలో అధికారంలో ఉన్న కేసీఆర్, హరీశ్ రావు వద్ద ఎన్ని కోట్లు ఉంటాయో ఊహించవచ్చని అన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరుగుతోందని... కేబినెట్ సమావేశం తర్వాత అన్ని విషయాలను వెల్లడిస్తారని చెప్పారు.

సీఎం రేవంత్ గురించి మాట్లాడుతూ... రేవంత్ జూనియర్ అయినప్పటికీ సీనియర్లను గౌరవిస్తున్నారని కోమటిరెడ్డి కితాబునిచ్చారు. పార్టీలో అందరూ ఒక టీమ్ లా పనిచేస్తున్నామని చెప్పారు. బనకచర్ల ప్రాజెక్ట్ ను కట్టనివ్వబోమని, శ్రీశైలం ప్రాజెక్ట్ ను కాపాడతామని తెలిపారు. నల్గొండ జిల్లాను సస్యశ్యామలం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. సాగునీటి ప్రాజెక్టులపై తాము కట్టుబడి ఉన్నామని చెప్పారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత వ్యవహారం గురించి ప్రశ్నించగా... ఆమె ఎవరో తనకు తెలియదని అన్నారు.

## కవిత దీక్షకు కోర్టు నో.. ఇంటికి కవిత

మొదటిపేజీ తరువాయి

కార్యకర్తలు దీక్ష కొనసాగించాలని పట్టుబట్టారు. పోలీసులు వారిని అడ్డుకుంటూ, వర్షం తగ్గిన వెంటనే కవితను లిఫ్ట్ చేయనున్నట్లు సంకేతాలిచ్చారు.

కోర్టు ఈ నిరాహార దీక్షకు అనుమతి ఇవ్వలేమని స్పష్టం చేసినట్లు సమాచారం. అనుమతి కోసం దాఖలైన పిటిషన్‌ను తిరస్కరించడంతో కవిత దీక్ష కొనసాగించే మార్గం లేకుండా పోయింది. కవిత చేపట్టిన దీక్షకు రాజకీయంగా మద్దతు దొరకడం కష్టమవుతున్న వేళ, కోర్టు తీర్పు ఈ పరిణామాలకు కొత్త మలుపు తిప్పింది. నిరాహార దీక్షను విరమిస్తూ ఎమ్మెల్సీ కవిత ఇంటికి పయనమయ్యారు.



## బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేయొచ్చు.. భయపడొద్దు

మొదటిపేజీ తరువాయి



అని వ్యాఖ్యానించారు. కమిషన్ నివేదిక ఊహించినట్లుగానే వచ్చిందని, దానిపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. "కొంతమంది బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేసే అవకాశం ఉంది. అయితే భయపడవద్దు. ఇది రాజకీయ పన్నాగం తప్ప మరేం కాదు," అని కేసీఆర్ తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టును పనికిరాదని చెప్పేవారు అజ్ఞానులని విమర్శించారు.

కాళేశ్వరం ప్రాజెక్టుపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని పార్టీగా బలంగా తిప్పికొట్టాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. ప్రాజెక్ట్ ద్వారా తెలంగాణకు కలిగిన ప్రయోజనాలను ప్రజలకు విపులంగా వివరించాలని సూచించారు.

కేబినెట్ సమావేశంలో కాళేశ్వరం పై ప్రభుత్వం తీసుకునే నిర్ణయాన్ని చూసి తగిన వ్యూహం సిద్ధం చేస్తామని కేసీఆర్ ప్రకటించారు.

## అవయవదానంలో దేశానికే ఆదర్శంగా తెలంగాణ..

మొదటిపేజీ తరువాయి

తెలంగాణ దేశంలోనే ముందు వరుసలో ఉంది.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'జీవన్‌దాన్' కార్యక్రమం ఈ ఘనత సాధించడంలో కీలక పాత్ర పోషిస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా ఏటా అవయవదాతల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. 2021లో 162 మంది దాతలు ఉండగా, 2022 నాటికి ఆ సంఖ్య 194కి పెరిగింది. ఇదే ఒరవడి 2023, 2024 సంవత్సరాల్లోనూ కొనసాగింది. 2023లో కూడా తెలంగాణ.. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలతో పోటీపడి అగ్రస్థానంలో నిలవడం గమనార్హం.

'జీవన్‌దాన్' కార్యక్రమం కింద మరణించిన దాతల నుంచి కిడ్నీలు, కాలేయం, గుండె, ఊపిరితిత్తులు, క్లోమం, కంటి కార్నియాలు వంటి కీలక అవయవాలను సేకరించి ఎంతోమందికి పునర్జన్మ ప్రసాదిస్తున్నారు. ముఖ్యంగా కొవిడ్ మహమ్మారి తర్వాత ప్రజల్లో అవయవదానంపై అవగాహన పెరగడం, మరణించిన వారి కుటుంబ సభ్యులు అవయవదానానికి స్వచ్ఛందంగా ముందుకు రావడం ఈ విజయానికి ప్రధాన కారణాలని నిపుణులు చెబుతున్నారు.

తాజా గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా అవయవదానం రేటు ప్రతి పది లక్షల జనాభాకు ఒకటి కంటే తక్కువ(0.8)గా ఉన్నప్పటికీ, తెలంగాణలో ఇది 4.88గా ఉంది. తెలంగాణ సాధించిన ఈ పురోగతి ఎంతో ఆశాజనకంగా కనిపిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, నిరంతర అవగాహన కార్యక్రమాలు, ఆసుపత్రులు, అధికారుల మధ్య సమర్థవంతమైన సమన్వయం వల్లే ఇది సాధ్యమైందని చెప్పవచ్చు. అవయవాల కొరతను అధిగమించి, ప్రాణాలను కాపాడటంలో తెలంగాణ మోడల్ ఇతర రాష్ట్రాలకు ఒక మార్గదర్శిగా నిలుస్తోంది.



## ఇవేం మాటలు?... రాహుల్ గాంధీపై సుప్రీంకోర్టు ఆగ్రహం

- చైనాతో సరిహద్దులో భారత సైన్యం సరిగా పోరాడలేదన్న రాహుల్
- పరువు నష్టం కేసు దాఖలు చేసిన బీజేపీ నేత
- ఈ కేసుపై స్టే ఇచ్చిన అత్యున్నత న్యాయస్థానం
- ఆచితూచి వ్యాఖ్యలు చేయాలంటూ రాహుల్ కు హితవు

**న్యూఢిల్లీ ఆగస్టు 04 (సిద్దిపేట పవర్):**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భారత సైన్యం గురించి చేసిన వ్యాఖ్యలపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. "దేశభక్తి ఉన్న ఏ భారతీయుడూ ఇలాంటి వ్యాఖ్యలు చేయడు" అని కోర్టు అభిప్రాయపడింది. అయితే, ఈ వ్యాఖ్యలకు సంబంధించిన పరువు నష్టం కేసులో రాహుల్ గాంధీకి తాత్కాలిక ఊరట లభించింది.

ఇటీవల ఒక కార్యక్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, "మన భారత ఆర్మీ చైనా సరిహద్దులో సరైన విధంగా పోరాడలేదు" అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ నాయకుడు ఒకరు రాహుల్ గాంధీపై పరువు నష్టం కేసు దాఖలు చేశారు. ఈ కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు రాహుల్ గాంధీ వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుపట్టింది. అయినప్పటికీ, కోర్టు ఈ కేసుపై స్టే జారీ చేసింది.

రాహుల్ గాంధీ తరపున వాదించిన న్యాయవాది, ఆయన వ్యాఖ్యలను వక్రీకరించారని, సైన్యాన్ని అవమానించే ఉద్దేశం రాహుల్ గాంధీకి లేదని కోర్టులో వాదించారు. ఈ వాదనను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు, పరువు నష్టం కేసుపై స్టే ఇచ్చింది. అయితే, రాహుల్ గాంధీ వంటి బాధ్యతాయుత రాజకీయ నాయకులు ఇలాంటి వ్యాఖ్యలు చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని కోర్టు సూచించింది.





## విద్యార్థులకు టై, బెల్ట్, ఐ డీ కార్డు అందచేత

**చేర్యాల, ఆగస్టు 4 (సిద్దిపేట పవర్)**

చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లి లోని ప్రాథమిక పాఠశాలలో నీ విద్యార్థులందరికీ టై,బెల్ట్ మరియు ఐడి కార్డులను ల్యాగల అనిల్ కుమార్ పంపిణీ చేశారు. అనిల్ కుమార్ మాట్లాడుతూ సొంత గ్రామం మరియు చదువుకున్న పాఠశాల విద్యార్థులందరికీ పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు టింగిరికార్ కిషన్ మాట్లాడుతూ టై, బెల్ట్ మరియు ఐడి కార్డులను అందించిన అనిల్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు D. ఆయిల్ రెడ్డి, కర్రోళ్ల విజయ్ కుమార్,R. సంధ్యారాణి, స్వరూప ,కవిత, విద్యార్థులు తల్లిదండ్రులు కొక్కొండ వినోద్, మాడబోయిన మల్లేశం,కొక్కొండ తిరుపతి, లింగంపల్లి సురేందర్, ల్యాగల సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు బజార్లో మండుతున్న కూరగాయల ధరలు



**సిద్దిపేట పవర్ ప్రతినిధి:**

సిద్దిపేటలోని రైతు బజార్లో కూరగాయల ధరలు చుక్కలను తాకాయి. పది రూపాయలకు కిలో ఉన్న టమాట ప్రస్తుతం 40 రూపాయలకు ఎగబాకింది. 20 30 రూపాయలకు కేజీ చొప్పున అమ్మే కూరగాయల ధరలు అన్ని దాదాపు గా 50 రూపాయలకు చేరుకున్నాయి. నిరుపేద సామాన్య ప్రజలు నిత్యము కూరగాయలతో వంట చేసుకుని కడుపు నింపుకుంటారు. అయితే కూరగాయల ధరలు మండిపోతున్నాయని, ఒక్కసారి ఇంత రేటు పెంచడం న్యాయం కాదంటూ సామాన్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూరగాయల ధరలు సిద్దిపేట రైతు బజార్ లో ఈ విధంగా ఉన్నాయి. టమాటా కేజీ 40 రూపాయలు, తెల్ల వంకాయ కేజీ 34 రూపాయలు,నల్ల వంకాయ కేజీ 30 రూపాయలు, బెండకాయ కేజీ 44 రూపాయలు, సన్నమిర్చి కేజీ 74 రూపాయలు, దొడ్డు మిర్చి కేజీ 60 రూపాయలు, కాకరకాయ నల్లది 40 రూపాయలు, తెల్ల కాకరకాయ కేజీ 40 రూపాయలు, బీరకాయలు కేజీ 44 రూపాయలు, క్యాబేజీ కేజీ 28 రూపాయలు, దొండకాయ కేజీ 48 రూపాయలు, క్యారెట్ కేజీ 42 రూపాయలు,బీర్నిష్ కేజీ 88 రూపాయలు, ఆలుగడ్డ కేజీ 25 రూపాయలు, ఉల్లిగడ్డ కేజీ 24 రూపాయలు, పొడవు చిక్కుడుకాయ కేజీ 60 రూపాయలు, క్యాప్సికం కేజీ 50 రూపాయలు,పొట్లకాయ కేజీ 40 రూపాయలు, చామగడ్డ కేజీ 34 రూపాయలు, పాపిడి చిక్కుడు కేజీ 48 రూపాయలు, గోరుచిక్కుడు కాయ కేజీ 54 రూపాయలు, చింతపండు కేజీ 100 రూపాయలు, పల్లికాయ కేజీ 65 రూపాయలు, కందగడ్డ కేజీ 44 రూపాయలు, లోకల్ అల్లం కేజీ 100 రూపాయలు, నాన్ లోకల్ అల్లం కేజీ 50 రూపాయలు, ఎల్లిగడ్డ కేజీ 110 రూపాయలు, కీరదోస కేజీ 24 రూపాయలు, బీట్రూట్ కేజీ 30 రూపాయలు, చామగడ్డ కేజీ 34 రూపాయలు, కిరాదోస కేజీ 24 రూపాయల చొప్పున రైతు బజార్లో ధరలు ఉన్నాయి. ఇంకా కొత్తిమీర పది రూపాయలకు రెండు కట్టలు, మెంతి పది రూపాయలకు రెండు కట్టలు, పాలకూర 50 రూపాయలకు ఐదు కట్టలు, పది రూపాయలకు రెండు ఉల్లి కట్టలు, 50 రూపాయలకు ఐదు పచ్చి కంకులు, 20 రూపాయలకు పావు కేజీ స్వీట్ కార్న్ మొక్కజొన్నలు, పది రూపాయలకు రెండు లేదా మూడు నిమ్మకాయలు అమ్ముతున్నారు. వర్షాకాలంలోనూ కూరగాయల ధరలు కొండెక్కడంతో పెళ్లిళ్లు చేసేవారికి ఖర్చు తడిసి మోపెడవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇక శ్రావణమాసం మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఒక పొద్దులు ఉంటూ శాఖాహారం భుజిస్తున్నందున వారికి కూడా కూరగాయల రేట్లు మండిపోవడం రుచించడం లేదు.








# యూరియా కోత.. రైతన్న వెత

మొదటిపేజీ తరువాయి

గందరగోళం నెలకొంది. ఇది రైతులకు తప్పుడు సంకేతాలను ఇస్తుందని, గ్రామాల్లో యూరియా కోసం ఆందోళనలు పెరిగే అవకాశం ఉందని రాష్ట్ర అధికారులు అంటున్నారు.

చర్చనీయాంశమైన కేంద్రమంత్రి ప్రకటన

రాష్ట్రంలో యూరియా కొరత తీవ్ర రూపం దాల్చే పరిస్థితి ఉందని ప్రభుత్వం ఆందోళన చెందుతున్న నేపథ్యంలో, లోక్‌సభలో కేంద్ర సహాయ మంత్రి అనుప్రియా పటేల్ చేసిన ప్రకటన చర్చనీయాంశమైంది. తెలంగాణకు ఈ ఖరీఫ్ (వానాకాలం) సీజన్‌లో అవసరమైన 20.30 ఎల్ఎంటీల కన్నా అధికంగా 22.15 ఎల్ఎంటీలు సరఫరా చేసినట్లు కేంద్రమంత్రి వెల్లడించారు. దీంతో బిత్తరపోవడం రాష్ట్ర ప్రభుత్వం, అధికారుల వంతయ్యింది.

వాస్తవానికి ఈ వానాకాలం సీజన్‌కు సంబంధించి.. యూరియాతో పాటు డీఏపీ, ఎంఓపీ, కాంప్లెక్స్, ఎస్ఎస్‌పీ ఎరువులు కలిపి 22.15 ఎల్ఎంటీ ఇచ్చినట్లు చెప్పాల్సిన కేంద్ర మంత్రి.. కేవలం యూరియానే 22.15 ఎల్ఎంటీ సరఫరా చేసినట్లుగా చెప్పారని ఓ అధికారి వివరించారు. నిజానికి ఇప్పటివరకు ఇచ్చిన యూరియా 4.50 ఎల్ఎంటీలు మాత్రమేనని చెప్పారు.

**అసలు లెక్కలేంటి?**

రాష్ట్రంలో పంటల విస్తీర్ణం భారీగా పెరిగింది. ఈ వానాకాలంలో ఏకంగా 134 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఈ నేపథ్యంలో 10.48 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. కానీ కేంద్రం ఈ సీజన్‌కు గాను నెలవారీగా 9.80 ఎల్ఎంటీలు మాత్రమే కేటాయించింది.

అదేమంటే యాసంగి సీజన్‌లో మిగిలిన యూరియా 1.92 ఎల్ఎంటీ గోదాముల్లో ఉందని, దాన్ని వినియోగించుకోవాలని సూచించింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ సమాచారం మేరకు.. ఏప్రిల్ నుంచి జూలై వరకు కేంద్రం 6.60 ఎల్ఎంటీల యూరియా సరఫరా చేయాల్సి ఉండగా 4.50 ఎల్ఎంటీలే వచ్చింది.

అంటే 2.10 ఎల్ఎంటీ (32 శాతం) తక్కువగా వచ్చిందన్న మాట. దీనికి రాష్ట్రం వద్ద ప్రారంభ నిల్వ కింద ఉన్న యూరియా 1.92 ఎల్ఎంటీలు కలిపితే మొత్తం 6.42 ఎల్ఎంటీలు అందుబాటులోకి వచ్చినట్టయ్యింది. ఇందులో సుమారు 5.20 ఎల్ఎంటీలు ఇప్పటికే రైతులకు విక్రయించగా.. 1.20 ఎల్ఎంటీల పైచిలుకు నిల్వలు ఉన్నట్లు తెలుస్తోంది.

**2 ఎల్ఎంటీలైనా వస్తేనే..**

ఈ సీజన్‌లో రాష్ట్రానికి కేటాయించిన 9.80 ఎల్ఎంటీలకు గాను జూలై వరకు 4.50 ఎల్ఎంటీలు సరఫరా చేసిన నేపథ్యంలో ఇంకా 5.30 ఎల్ఎంటీల యూరియా రావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో నాలుగు నెలల్లో కోత విధించిన 2.10 ఎల్ఎంటీలతో పాటు ఆగస్టు కోటా 1.70 ఎల్ఎంటీలు కలిపి ఈ నెలలో సరఫరా చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఇప్పటికే కేంద్రాన్ని కోరారు. కాగా ఇటీవల కేంద్ర మంత్రి ప్రకటన నేపథ్యంలో అధికారులు సమావేశమై యూరియా కొరత పరిస్థితిని సమీక్షించారు.



ఆగస్టులో కనీసం 2 ఎల్ఎంటీల యూరియా అయినా వస్తేనే ప్రస్తుతానికి గట్టెక్కే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. మరోవైపు మంత్రి తుమ్మల కూడా తాజాగా కేంద్ర మంత్రి అనుప్రియా పటేల్‌కు లేఖ రాశారు. రాష్ట్రానికి యూరియా కేటాయింపులు, ఇప్పటివరకు కేంద్రం నుంచి వాస్తవంగా వచ్చిన యూరియా వివరాలు తెలియజేశారు. రాష్ట్రంలో కొరతను దృష్టిలో పెట్టుకుని తక్షణమే అవసరమైన యూరియాను పంపించాలని విజ్ఞప్తి చేశారు.




## బీసీల రిజర్వేషన్లు అడ్డుకుంటున్న బిజెపి

- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి
- సిపిఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి కార్యదర్శి వర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య

**సిద్ది పేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం :** అసెంబ్లీలో ఆమోదం చేసి పార్లమెంటు పంపించిన బీసీ రిజర్వేషన్ ఆర్డినెన్స్ను బిజెపి అడ్డుకుంటుందని సిపిఐఎం పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి సభ్యులు సందబోయిన ఎల్లయ్య అన్నారు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, పార్లమెంట్లో ఆర్డినెన్స్ ఆమోదించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం పార్టీ గజ్వేల్ మండలం కమిటీ సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని పార్టీలు బలపరిచి అసెంబ్లీలో బిల్లును ఆమోదించి రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తయారు చేసి గవర్నర్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పార్లమెంటుకు పంపిస్తే కేంద్రంలో బిజెపి అడ్డుకుంటుందని అన్నారు. దేశవ్యాప్తంగా కులగనన సర్వే చేయాలని డిమాండ్ చేశారు. మైనార్టీలలో దూదేకుల పకీరు, కాషా అనేక రకాల వెనుకబడిన వారు ఉన్నారని అన్నారు. బీసీ కులాల్లో వివిధ మతాల స్వీకరించిన వారు ఉన్నారని కారణంతో వారికి రిజర్వేషన్లు ఉండకూడదని ఉద్దేశంతో రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తూ ప్రజలను మోసం చేస్తుందని అన్నారు. రాజస్థాన్ ఉత్తర ప్రదేశ్ మధ్యప్రదేశ్ తదితర బిజెపి పాలిత రాష్ట్రాల్లో మాత్రం అమలు చేస్తూ తెలంగాణలో మాత్రం వ్యతిరేకంగా వ్యవహరిస్తుందని అన్నారు. కార్మిక చట్టాలను రద్దు చేసి యజమానులకు అనుకూలంగా కార్మిక కోడలు తెచ్చిందని, కనీస వేతనాలు పెంచడం లేదని, నిత్యవసర సరుకుల ధరలు పెంచిందని, పెట్రోల్ డీజిల్ ధరపై పన్నులతో పాటు అదనంగా సెస్ విధిస్తూ ప్రజలపై భారం మోపుతు ప్రజావ్యతిరేక చర్యలకు పాల్పడుతుందని అన్నారు. కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్ల రాయితిలు కల్పిస్తూ సామాన్యులను రోడ్డున పడేస్తుందని అన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి అన్ని జుమ్లా అని తెలిపిందని అన్నారు అమెరికాతో దోస్తీ చేస్తూ దేశంపై 25% పన్నుల విధింపు కారణమవుతుందని అన్నారు. దీంతో దేశంలో తయారైన సరుకులు అమ్ముడుపోక ఆర్థిక వ్యవస్థ కుదేలు అవకాశం ఉందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని, పింఛన్లు వెంటనే మంజూరు చేయాలని పెండింగ్లో ఉన్న రోడ్లు వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రంగారెడ్డి, నాయకులు బండ్ల స్వామి, రాణి, వెంకట చారి రాజు,ఐలయ్య,లక్ష్మి స్వామి తదితరులు పాల్గొన్నారు.

## మధ్యప్రదేశ్ కి చెందిన పత్తి డిసీఎం దగద్దం

**యస్ ఐ జే. కృష్ణ రెడ్డి**

**సిద్ది పేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం :** తేదీ 3వ ఆదివారం నాడు రాత్రి 10 గంటల ప్రాంతంలో మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్ పట్టణానికి చెందిన రాజా బాబు శర్మ తన యొక్క డీసీఎం వెహికల్ నెంబర్. ఎం హెచ్ 40సీడీ 9565 నీ తమిళనాడులోని తిరువల్లూరు పట్టణం నుండి కాటన్ ను మధ్యప్రదేశ్ కు తీసుకు వెళ్తుండగా జగదేవపూర్ దాటిన తర్వాత కొద్ది దూరంలో డీసీఎం వ్యాన్ లొని డాష్ బోర్డు నుండి మంటలు రావడంతో డ్రైవర్ అయినా రాజబాబు శర్మ వెంటనే వాహనాన్ని దిగినాడు. వెంటనే చూసిన వ్యక్తులు ఫైర్ ఇంజన్ కి, పోలీసులకి ఫోన్ చేయగా అక్కడికి వెళ్లి డీసీఎం యొక్క మంటలను ఆర్పి అదుపులోకి తెచ్చినారు. దీని కారణంగా గంటసేపు రోడ్డు జామ్ అయింది. పోలీసులు మంటలు ఆరిన తర్వాత రోడ్డు ని క్లియర్ చేశారు. డ్రైవర్ అయినా రాజబాబు యొక్క ఫిర్యాదు మేరకు ఫైర్ యాక్సిడెంట్ గా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న జగదేవపూర్ పోలీస్ లు.









## చేర్యాల రెవెన్యూ డివిజన్ కొరకు బైక్ ర్యాలీ

- రేపటి నుండి నాలుగు మండలాలలో బైక్ ర్యాలీ లు
- జేఏసీ చైర్మన్ వకుళాభరణం నర్సయ్య పంతులు

**చేర్యాల, ఆగస్టు 4 (సిద్దిపేట పవర్)** చేర్యాల ను రెవెన్యూ డివిజన్ గా మార్చాలని కోరుతూ రేపటి నుండి కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట, చేర్యాల మండలంలో బైక్ ర్యాలీ లు నిర్వహిస్తున్నామని జేఏసీ చైర్మన్ వకుళాభరణం నర్సయ్య పంతులు తెలిపారు..ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 5 వ తేదీన కొమురవెల్లి మండలంలో, 7 వ తేదీన ధూళిమిట్ట మండలంలో, 11 వ తేదీన మద్దూరు మండలంలో, 14 వ తేదీన చేర్యాల మండలం లో, 18 వ తేదీన చేర్యాల పట్టణంలో బైక్ ర్యాలీ లు జరుగుతాయని తెలిపారు..ఈ ర్యాలీల అనంతరం 25 వ తేదీన రాజీవ్ రహదారి (దుద్దెడ చౌరస్తా) నీ ముట్టడిస్తామని దీనికి ప్రజలు, డివిజన్ సాధన సమితి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని నర్సయ్య పంతులు పిలుపునిచ్చారు..

## దేవాదుల కాలువను పూర్తి చేయాలని కలెక్టరేట్ కి వినతి

- 20సంవత్సరాలు గడిచినా పూర్తి కానీ దేవాదుల కాలువ
- 700 ఎకరాలకు నీరు అందక రైతుల ఇబ్బందులు

**చేర్యాల, ఆగస్టు 4 (సిద్ది పేట పవర్)** జనగామ నియోజకవర్గం బచ్చన్నపేట మండలం మీదుగా చేర్యాల మండలంలోని నాగపురి గ్రామ శివారులోని గండికుంట వరకు వచ్చిన దేవాదుల కాలువ పోతిరెడ్డిపల్లి బయ్యన్న చెరువు వరకు పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఏఐకేఎస్) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట గంట పాటు రైతులు ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ షేక్. రిజ్వాన్ పాషా కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జనగామ, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ఆది సాయన్న, కత్తుల భాస్కర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ.. బచ్చన్నపేట మండల శివారు నుండి ప్రారంభమైన దేవాదుల కాలువ చేర్యాల మండలం నాగపురి గ్రామ శివారులోని గండికుంట వద్దకు వచ్చి 2006 సంవత్సరంలో నిలిపివేశారని, పోతిరెడ్డిపల్లి గ్రామ బయ్యన్న చెరువు వరకు భూములు సర్వే చేసి రైతులకు డబ్బులు కూడ చెల్లించారని, కానీ నేటికి 20 సంవత్సరాలు గడిచినప్పటికీ కాలువ నిర్మాణ పనులు పూర్తి కాకపోవడం విచారకరమన్నారు. ఈ కాల్వ పోతిరెడ్డిపల్లి వరకు పూర్తి చేస్తే సుమారు 700 ఎకరాల భూములకు సాగునీరు అందడమే కాకుండా భూగర్భ జలాలు పెరిగి రైతుల భూములు సాగులోకి వచ్చి సస్యశ్యామలమవుతాయని అన్నారు. వెంటనే కాల్వ పనులు పూర్తి చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఏఐకేఎస్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి సొప్పరి సోమయ్య, జిల్లా నాయకుడు అందె అశోక్, వలబోజు నరసింహాచారి, రైతులు గూడూరి బాలరాజు, జింకల హరికృష్ణ, బట్టు భాస్కర్,కొక్కొండ రవీందర్, మాడబోయిన నరేష్, జోగు పరశురాములు, అప్పల బాలయ్య, కొక్కొండ పోశయ్య, పోరెడ్డి సత్యనారాయణ, పోరెడ్డి భాస్కర్, పోరెడ్డి అశోక్, అప్పల బాబు, కొక్కొండ మల్లేశం, కొక్కొండ పరమేష్, పాల కమలాకర్, కొక్కొండ భాస్కర్, కొక్కొండ రాజు,బోకూరు భాను ప్రకాశ్ రెడ్డి, కొక్కొండ నరేష్, జట్టి చందు, గర్నపల్లి రాజు, తదితరులు పాల్గొన్నారు.



## మెరుగైన వైద్యం కోసం ఎల్. ఓ .సీ అందజేత.

**ఎంపీ రఘునందన్ రావు కృషితో**

**సిద్దిపేట పవర్:**

పుట్టుకతో చెవి వినికిడి తో ఇబ్బంది పడుతున్న పిల్లం రమేష్ కుమారుడు పిల్లం వరుణ్ కు ఆరు లక్షల ఎల్ఓసి ప్రోసిడింగ్ అందజేసిన 17వ వార్డు కౌన్సిలర్ కొత్తపల్లి రాధ వేణుగోపాల్.



## పద్మశాలీలు రాజకీయంగా చైతన్యవంతులు కావాలి.



**సిద్దిపేట పట్టణ యువజన సంఘం అధ్యక్షులు భైరి మురళీ ప్రధాన కార్యదర్శి క్యాతం సాగర్.**

**సిద్దిపేట పవర్:**

సిద్ధిపేటలోని మార్కండేయ దేవాలయంలో పట్టణ పద్మశాలి యువజన కార్యవర్గం పట్టణ మహిళ కార్యవర్గం ఎన్నికైన సందర్భంగా వారికి నియామక పత్రాలును పట్టణ CI లు ఉపేందర్, విద్యాసాగర్ పట్టణ అధ్యక్షులు కాముని రాజేశం జిల్లా అధ్యక్షులు డా: కస్తూరి సతీష్ పాల్గొని నియామక పత్రాలను అందజేశారు. అనంతరం ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి నూతనంగా ఎన్నుకోబడిన సభ్యులు పూల మాలవేసి సభ్యులు మాట్లాడుతూ పద్మశాలి సమాజ అభివృద్ధి కోసం అదేవిధంగా సమాజంలో జరిగే కార్యక్రమాలలో గాని సమాజ సభ్యులకు ఏదైనా సమస్య వచ్చిన మా యువజన సంఘం ముందుంటాం అదేవిధంగా ప్రతి సోమవారం మార్కండేయ దేవాలయంలో భజన కార్యక్రమం కూడా నిర్వహిస్తూ పద్మశాలి సమాజం ఇంకా ఉన్నత స్థాయిలో ఉన్నటువంటి నాయకులు అధికారులు అందరూ కలిసి మన సమాజం యొక్క ఐక్యతను చాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ పద్మశాలి సమాజం ఉపాధ్యక్షులు పెద్ది అశోక్, ఇప్పకాల శ్రీహరి, ప్రధాన కార్యదర్శి సిరిగాది బాల్ రాజు, సహాయ కార్యదర్శిలు గుండు రవితేజ లడ్డు, చిలుక ఆంజనేయులు, కోశాధికారి సూరం ప్రసాద్, కార్యవర్గ సభ్యులు పెద్ది శ్రీనివాస్, భైరి ప్రకాష్, దీకొండ మహేష్, కొండబత్తిని రాజ్ కోటి, పీర్ల రాజేంద్రప్రసాద్, దండే సంతోష్ కుమార్, వీరబత్తిని నగేష్, అడప్ నాగరాజు, మహిళా కార్యవర్గ సభ్యులు గొట్టిపాముల జలజ, తిరుమల్ సునీత, పుట్ట సునీత, తదితరులు పాల్గొన్నారు.



## కలెక్టర్ మేడం ఒకసారి మా ప్రభుత్వ పాఠశాలలకు రండి





- దీనస్థితిలో కెసిఆర్ నగర్ ప్రభుత్వ పాఠశాల.
- మరుగుదొడ్ల నిర్మాణం పక్కన కూర్చొని చదువుకుంటున్న విద్యార్థులు...
- తరగతిలో కూర్చోడానికి కూడా స్థలం లేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు...

**సిద్దిపేట పవర్ ప్రతినిధి:**

గత మూడున్నర సంవత్సరాల నుంచి ప్రజల కోసం నిర్మించిన డబల్ బెడ్రూం గదులలో ప్రభుత్వ ప్రైమరీ, ఉర్దూ హైస్కూలను నడుపుతున్నారు. విద్యార్థులు డబుల్ బెడ్ రూమ్ హాళ్లలో నిర్మించిన మరుగుదొడ్డి నిర్మాణం ప్రక్కనే కూర్చుని పాఠాలు వింటున్నారు. అక్కడ చదువుతున్న విద్యార్థుల సంఖ్యకు తగినట్టు కనీసం కూర్చోవడానికి కూడా సరిపడా స్థలం లేక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. గతంలో ఈ సమస్యల కోసం పరిష్కారానికై మండల జిల్లా విద్యాధికారులకు వినతి పత్రాలు అందజేసినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు సమస్యలు అలానే ఉన్నాయి. వాటితోపాటు ఇప్పుడు కొత్తగా కొంతమంది బయట వ్యక్తులు వచ్చి పాఠశాలకు కేటాయించిన డబల్ బెడ్రూంలో గత ఎండాకాలం నుండి నివసిస్తున్నారు. ప్రభుత్వ అధికారుల నుండి ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో అక్కడ ఉన్నటువంటి ఉపాధ్యాయులు రెండు తరగతుల విద్యార్థులను ఒకటే గదిలో కూర్చుండబెట్టి చదువు చెప్తున్నారు.









దీనివల్ల విద్యార్థులకు చదువుకోవడం పక్కనబెడితే కనీసం వారికీ పాఠాలు చెప్పడానికి కూడా వీలులేని దుస్థితి ఏర్పడింది. ఇక్కడి విద్యార్థులకు బాత్రూంలు లేక ఆరు బయటకు వెళ్తున్నారు, విద్యార్థులకు సరిపోయే విధంగా తరగతికి ఒక గది కూడా లేదు, మధ్యాహ్న భోజనశాల లేదు, వంటశాల లేదు, ఆట స్థలం లేదు, కాంపౌండ్ వాల్ లేదు, చివరికి ప్రభుత్వ పాఠశాల అని గుర్తించడానికి కావాల్సిన ఏ ఒక్క వసతి ఇక్కడ లేకపోవడం చాలా దారుణం. కాబట్టి సిద్దిపేట జిల్లా కలెక్టర్ ఒకసారి ఈ పాఠశాలను సందర్శించి ఇక్కడ తిష్ట వేసిన సమస్యలకు ఒక పరిష్కారం చూపాలని విద్యార్థులు వేడుకుంటున్నారు.

## హరీష్ రావు కృషితోనే సిద్ధిపేట అభివృద్ధి

- ప్రజలకు సేవచేయడానికి పాలకవర్గం ఎప్పుడు ముందుంటుంది
- మున్సిపాలిటీలో పిర్యాదుల పేటిక
- ప్రజలు, ప్రజా ప్రతినిధులు.. మున్సిపల్ అధికారులకు సహకరించాలి
- అవినీతి చేస్తే... ఎవరిని ఉపేక్షించేది లేదు
- సిద్దిపేట మున్సిపల్ చైర్పర్సన్ కడవేరుగు మంజుల రాజనర్సు

**సిద్ధిపేట పవర్:** సిద్ధిపేట పురపాలక సంఘం కార్యాలయంలో ఈరోజు మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు గారితో కలిసి మీడియా సమావేశాన్ని నిర్వహించిన మున్సిపల్ చైర్పర్సన్ శ్రీమతి కడవేరుగు మంజుల రాజనర్సు గారు.

**చైర్పర్సన్ మాట్లాడుతూ..**

సిద్ధిపేట అభివృద్ధి ముమ్మాటికీ బిఆరెస్ పార్టీ హయాంలోనే జరిగిందని,తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గారి సహకారం మరియు మాజీ మంత్రి వర్యులు, ఏమైల్యే తన్నీరు హరీష్ రావు గారి కృషితోనే పట్టణం ఇంతలా అభివృద్ధి చెందిదని అన్నారు.సిద్ధిపేట మున్సిపాలిటీ ఒక దిక్సూచి అని అన్నారు. రాష్ట్రములో బిఆరెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు బిఆరెస్ పార్టీ గుర్తుపై గెలిచినటువంటి కొంతమంది కౌన్సిలర్లు అధికారంలో పోగానే పార్టీ మారి బిఆరెస్ పార్టీపై విషం కక్కుతు తమ నిజ స్వరూపాన్ని చూపిస్తున్నారని అన్నారు.ఇది కూడా తమ మంచికె జరిగిందని ఎవరు మన వారో ఎవరు బయటివారో ఈవిదంగా తెలిసిందని అన్నారు. సిద్ధిపేట మున్సిపాలిటీలో అవినీతి జరిగిందని కొంతమంది కౌన్సిలర్లు ఆరోపణలు చేసేటటువంటి విషయాలు పూర్తిగా అవస్తవమని అటువంటి ఆరోపణలకు సంబంధించిన ఆధారాలు ఉంటే వెంటనే ప్రభుత్వానికి నివేదిక అందించాలని అన్నారు.అవినీతి జరిగింది వాస్తవం అయితే పాలకవర్గం సభ్యులు కూడా వారికీ తొడ్పాటును అందిస్తామని అన్నారు. సిద్ధిపేట మున్సిపాలిటీ పేరు ప్రతిష్టలకు ఎవరు భంగం కలిగించిన (అధికారులు, ప్రజా ప్రతినిధులను) ఎవరిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.ప్రజలకు సేవచేయడానికి పాలకవర్గం ఎప్పుడు ముందుంటుందని చెప్పారు. సిద్ధిపేట మున్సిపాలిటీ 10 నెలలో 5 కోట్ల ట్యాక్స్ లను వసులు చేసిందని, మున్సిపాలిటీలో విధులు నిర్వహించే సి బ్బందికి రాష్ట్రములో ఎక్కడ లేని విదంగా మొదటి వారంలోనే జీతాలు అందించడం జరుగుతుందని అన్నారు. సిద్ధిపేట మున్సిపాలిటీలో విధులు నిర్వహించిన ప్రతి మున్సిపల్ కమిషనర్ పట్టణ అభివృద్ధికి కృషి చేస్తారని అన్నారు.

మున్సిపల్ వైస్ చైర్మన్ మాట్లాడుతూ పట్టణ కౌన్సిలర్లు ఇష్టానుసారంగా మాట్లాడవద్దని, వారి పద్ధతులు ఇప్పటికైనా మార్చుకోవాలని సూచించారు. అటువంటి వారందరిపై స్థానిక ఏమైల్యే, మాజీ మంత్రి హరీష్ రావు గారి దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని వారి నిర్ణయమే మా నిర్ణయమని ఎటువంటి నిర్ణయనికైనా తాము కట్టుబడి ఉంటామని అన్నారు. పట్టణంలో నూతనంగా ఇల్లు నిర్మించుకునే వారందరు కచ్చితంగా మున్సిపల్ నిబంధనలకు అనుగుణంగా నిర్మించుకోవాలని, ప్రజలకు సేవచేయడానికి పాలకవర్గం ఎప్పుడు ముందుంటుందని అన్నారు.మున్సిపల్ అధికారులకు ప్రజలు, ప్రజా ప్రతినిధులు సహకరించాలని కోరారు. అధికారులు ఎవరైనా అవినీతికి పాల్పడితే వెంటనే శాఖ పరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని హెచ్చరించారు. మున్సిపాలిటీలో త్వరలో పిర్యాదుల పేటికను అమర్చడం జరుగుతుందని మరియు అధికారుల విధులకు ఎవరు ఆటంకం కలిగించవద్దని అన్నారు.పిర్యాదు దారుల పేర్లను గొప్యంగా ఉంచడం జరుగుతుందని చెప్పారు. రాష్ట్రములో సిద్ధిపేట మున్సిపాలిటీ అంటే ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉందని అన్నారు.దానికి అందరూ సహకరించాలని కోరారు.తెలంగాణ రాష్ట్రం తో పాటు వేరే రాష్ట్రాలు కూడా సిద్ధిపేట పట్టణంలో పర్యటించి ఇక్కడ చేసినటువంటి అభివృద్ధిని పనులను వారి రాష్ట్రంలో అమలు చేస్తున్నారని గుర్తుచేశారు. హరీష్ రావు గారికి మరియు సిద్ధిపేట మున్సిపాలిటీ ఎవరు తలవంతులు తెచ్చిన ఉపేక్షించేది లేదని ఈ సందర్భంగా హెచ్చరించారు. పార్టీ మారిన కౌన్సిలర్లు జిల్లా మంత్రి గారితో మాట్లాడి వెంటనే సిద్ధిపేట మున్సిపాలిటీలో పెండింగ్ లో ఉన్నటువంటి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు అయ్యేలా చూడాలని అన్నారు.



## స్ట్రోమ్ వాటర్ డ్రైన్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే శ్రీగణేశ్

**త్వరలో అంబేడ్కర్ నగర్ వాసుల ఇబ్బందులు తీరుతాయని వెల్లడి**

**సికింద్రాబాద్, ఆగస్ట్ 04 ( సిద్దిపేట పవర్) :**

రాష్ట్ర ప్రభుత్వ నిధులు రూ.32 లక్షలతో మోండా డివిజన్ పరిధిలోని అంబేద్కర్ నగర్ లో చేపట్టిన స్ట్రోమ్ వాటర్ డ్రైన్ తో ఏండ్లుగా పెండింగ్ లో ఉన్న సమస్య తీరనుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. సోమవారం స్ట్రోమ్ వాటర్ డ్రైన్ పనులను ఎమ్మెల్యే శ్రీగణేష్ స్థానిక నాయకులతో కలసి పర్యవేక్షించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఎన్నో ఏళ్లుగా వర్షాకాల సమయంలో ఎగువ నుంచి వచ్చే వాటర్ ఫ్లో వల్ల ఇళ్లలోకి నీళ్లు చేరి ఆ ప్రాంత ప్రజలు బాగా ఇబ్బంది పడుతుండటాన్ని గమనించి ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళామని చెప్పారు. ఇటీవల నిధులు మంజూరీ కావడంతో పనులు ప్రారంభమయ్యాయని, త్వరలో స్ట్రోమ్ వాటర్ డ్రైన్ అందుబాటులోకి వస్తే ఇక్కడున్న దీర్ఘకాలిక సమస్య తీరుతుందన్నారు. త్వరితగతన పనులను పూర్తి చేసి ఈ వర్షాకాల సమయంలోనే ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయాలనే లక్ష్యంతో పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్ కు సూచించారు. ఎన్నో ఏళ్ల తమ బాధలు తీరుతుండడంతో బస్తీ వాసులు ఎమ్మెల్యే శ్రీగణేష్ కు కృతజ్ఞతలు తెలిపారు.ఎమ్మెల్యే వెంట స్థానిక కాంగ్రెస్ నాయకులు సంతోష్ యాదవ్, నాగేష్ యాదవ్, నర్సింగరావు,బస్తీ వాసులు ఉన్నారు



## బీసీ రిజర్వేషన్ల కోసం పోరాటం ఢిల్లీకి యూత్ కాంగ్రెస్ నాయకులు.

**నంగునూర్ ఆగస్టు 4 (సిద్దిపేట పవర్)**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతిపాదించిన 42 శాతం బీసీ రిజర్వేషన్ అమలుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వాలనే డిమాండ్‌తో, యన్ ఎస్ యు ఐ మరియు యూత్ కాంగ్రెస్ నాయకులు ఢిల్లీకి బయలుదేరారు. ఈ ఉద్యమంలో భాగంగా సిద్దిపేట జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సాదుల పవన్ కుమార్, యన్ ఎస్ యు ఐ పట్టణ అధ్యక్షుడు సాదుల సాయి ప్రతాప్, అసెంబ్లీ ఇంచార్జ్ రాకేష్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు అజ్మత్ అలీ, కర్రె మధు, నాయకం. సాయి కుమార్ ఢిల్లీకి పయనమయ్యారు. ఈ బృందం ఢిల్లీలో ముఖ్య నాయకులను కలవనుండగా, బీసీ హక్కుల సాధన కోసం తమ డిమాండ్లను మానవహక్కుల కమిషన్, ఇతర సంబంధిత కేంద్ర సంస్థల దృష్టికి తీసుకెళ్లనున్నారు. బీసీ వర్గాలకు న్యాయం జరగాలని, రాజకీయాల్లో తగిన ప్రతినిధిత్వం లభించాలని వారు కోరుతున్నారు. ఈ దిశగా కేంద్రం వెంటనే నిర్ణయం తీసుకోవాలని వారు డిమాండ చేస్తున్నారు.



## గేదె మెడకు కట్టిన తాడు అడ్డు రావడంతో అదుపుతప్పిన ద్విచక్ర వాహనం ...

**తీవ్ర గాయాలతో భర్త మృతి.**

**దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ ఆగస్టు 4**

కిరాణా సామాను కొనుగోలు చేసేందుకు ద్విచక్ర వాహనంపై దుబ్బాకకు వచ్చిన దంపతులు, తిరిగి స్వగ్రామానికి వెళుతున్న క్రమంలో చెట్టుకు కట్టేసిన గేదె తాడుతో సహా రహదారిపై అడ్డుగా రావడంతో, వాహనం అదుపుతప్పి, కిందపడి తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ భర్త మృతిచెందగా, భార్యకు స్వల్ప గాయాలు అయిన ఘటన దుబ్బాకలో పురపాలికలోని చెల్లాపూర్ శివారులో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. దుబ్బాక ఎస్సై కే.కీర్తి రాజు తెలిపిన వివరాల ప్రకారం... రాజక్క పేట గ్రామానికి చెందిన ముదిగొండ రాజేశం (55) గ్రామంలో కిరాణ దుకాణం నిర్వహణతో పాటు వ్యవసాయం చేస్తూ, భార్య చంద్రకళ, ఇద్దరు కుమార్తెలతో జీవనం కొనసాగించేవాడు.ఆదివారం దుకాణంలో అవసరమైన కిరాణ సామాను తీసుకురావడానికి భార్యతో కలసి టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్ర వాహనంపై దుబ్బాకు వచ్చాడు. అనంతరం సామాను ఖరీదు చేశాక ద్విచక్ర వాహనంపై భార్యతో కలిసి తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. ఈ క్రమంలో చెల్లాపూర్ శివారులోని ఐకెపి కేంద్రం సమీపంలో చెట్టుకు తాడుతో కట్టేసిన ఒక గేదే అకస్మాత్తుగా రహదారి మధ్యలోకి రావడంతో, గేదె తాడు ద్విచక్ర వాహనంలో ఇరుక్కొని, కింద పడ్డారు. ఈ ప్రమాదంలో రాజేశం తల వెనక భాగంలో తీవ్ర గాయాలు కాగా, చంద్రకళ కాలికి గాయమైంది. వెంటనే సమాచారం అందుకున్న 108 సిబ్బంది వారి వాహనంలో తీవ్రంగా గాయపడిన రాజేశంను సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్ యశోద ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందు సోమవారం తెల్లవారుజామున రాజేశం మృతి చెందాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



## ఫిష్ వెంకట్ అకాల మరణం బాధను కలిగించింది..

- వెంకట్ ఫ్యామిలీ మెంబర్స్ ను పరామర్శించిన సోను సూద్
- అన్ని విధాల ఆదుకుంటానని హామీ..

**సికింద్రాబాద్, ఆగస్ట్ 04 ( సిద్దిపేట పవర్):**

ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందిన ఫిష్ వెంకట్ కుటుంబాన్ని బాలీవుడ్ నటుడు సోను సూద్ పరామర్శించారు. సోమవారం అడ్డగుట్ట లోని ఆయన నివాసానికి వెళ్ళిన సోను సూద్ ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఫిష్ వెంకట్ మరణం తనకు బాధను కలిగించిందని అన్నారు. వారి కుటుంబానికి అన్ని విధాల ఆదుకుంటామని స్పష్టం చేశారు. ఫిష్ వెంకట్ మరణం తీరని లోటని, షూటింగ్ సెట్స్ లో తనతో అత్యంత ఆప్యాయంగా ఉండే వ్యక్తి అని గుర్తు చేసుకున్నారు. ఫిష్ వెంకట్ అందరిని అలరిస్తూ, సినిమాల్లో చక్కగా నటించి మంచి పేరు తెచ్చుకున్నారని వెల్లడించారు.

